సాక్షి నల్లగొండ

శనివారం । 1 । ఏప్రిల్ । 2023



రైతులు ఐక్యంగా పోరాడాలి

రైతులు తమ భూములను కాపాడుకునేందుకు ఐకమత్యంతో పోరాడాలని ప్రొఫెసర్ కోదండరాం సూచించారు.

- 8లో



హ్యాండ్లూమ్ పార్కు మూత

భూదాన్‌పోచంపల్లి మండలం కనుముకుల పరిధిలో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ పార్కు మూతపడింది.

- 10లో

గరిష్టం/కనిష్టం 37°/23°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-35 (శనివారం సాయంత్రం)

సహర్ 4-48 (ఆదివారం ఉదయం)

పీఆర్‌టీయూలో చిచ్చు

యూనియన్ నుంచి సుంకరి భిక్షంగౌడ్ సస్పెన్షన్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వ్యతిరేక వర్గానికి పనిచేసినట్లు గుర్తించిన కమిటీ
- జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగింపు
- జిల్లాకు చెందిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిపై సైతం వేటు
- ఉపాధ్యాయుల్లో పెద్ద ఎత్తున చర్చ



నల్లగొండలో ఉపాధ్యాయులతో సమావేశమైన భిక్షంగౌడ్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పీఆర్‌టీయూలో ఎమ్మెల్సీ ఎన్నిక చిచ్చు రేపింది. రంగారెడ్డి – మహబూబ్‌నగర్ – హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికలో యూనియన్ వ్యతిరేక వర్గానికి అనుకూలంగా పని చేసిన వారిపై ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ వేటు వేసింది. అందులో నల్లగొండ జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా పని చేస్తున్న సుంకరి భిక్షంగౌడ్ ఉన్నారు. ఆయన యూనియన్ బలపరచిన అభ్యర్థికి కాకుండా, ప్రత్యర్థికి అనుకూలంగా పని చేశారని ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ విచారణ చేసి తేల్చడంతో రాష్ట్ర కమిటీ భిక్షంగౌడ్‌ను యూనియన్ నియమావళి 20 హెచ్ ప్రకారం ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు ప్రకటించింది. అలాగే జిల్లాకు చెందిన రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నల్లమేకల వెంకయ్యపై కూడా వేటు పడింది.

వేటు పడిన ఆరుగురిలో ఇద్దరు మనోళ్లే..

పీఆర్‌టీయూలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా భిక్షంగౌడ్ సుదీర్ఘకాలం పనిచేశారు. ఐదేళ్లు ప్రధాన కార్యదర్శిగా, 8 ఏళ్లుగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయన అంతకుముందు కూడా యూనియన్‌లో వివిధ హోదాల్లో పని చేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి ఓడిపోయారు. ఈ ఎన్నికల్లో టీఎస్‌యూటీఎఫ్, పీఆర్‌టీయూ, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) సంఘాల మధ్య గట్టి పోటీ ఏర్పడింది. వాస్తవానికి అధిక సభ్యత్వం కలిగిన సంఘాల్లో పీఆర్‌టీయూ ముందుంది. తరువాత టీఎస్‌యూటీఎఫ్ ఉంటుంది. ఈ రెండు సంఘాల మధ్యనే పోటీ ఉంటుందని, పీఆర్‌టీయూ విజయం సాధిస్తుందని ఆ యూనియన్ భావించింది. ఫలితాలు మాత్రం అందుకు విరుద్ధంగా వచ్చాయి. టీపీయూఎస్ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి విజయం సాధించారు. దీంతో అత్యంత బలమైన సంఘం అయి ఉండి ఏవిధంగా ఓడిపోయామని రాష్ట్ర యూనియన్ పోస్టుమార్టం చేసింది. పలువురు యూనియన్‌లో ఉండి, బయటివారికి సపోర్టు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఆ నియోజకవర్గం పరిధిలో ఉండి, ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పని చేస్తున్న దాదాపు 650 మంది ఉపాధ్యాయులతో తమ యూనియన్ అభ్యర్థికి ఓట్లు పడేలా చూడకుండా ప్రత్యర్థికి అనుకూలంగా పని చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో రాష్ట్ర యూనియన్ ఐదుగురు సభ్యులతో కమిటీ వేసింది. ఆ కమిటీ విచారణ చేసి ఆరుగురు యూనియన్ నాయకులు తమ అభ్యర్థి కోసం పని చేయకుండా, ప్రత్యర్థి కోసం పని చేసినట్లు తేల్చింది. దీంతో ఆ ఆరుగురిని తొలగిస్తున్నట్లు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ప్రకటించారు. అందులో జిల్లాకు చెందిన భిక్షంగౌడ్‌ను, నల్లమేకల వెంకయ్య ఉన్నారు.

జిల్లా ఉపాధ్యాయుల్లో పెద్ద ఎత్తున చర్చ

గతంలో ఎప్పుడూ లేనివిధంగా యూనియన్ వ్యతిరేక విధానాలకు పాల్పడిన విషయంపై పీఆర్‌టీయూ ఒకేసారి ఆరుగురిని తొలగించడం చర్చనీయాంశంగా మారింది. అందులో జిల్లాకు చెందిన వారే ఇద్దరు ఉండటం, అందులోనూ సుదీర్ఘకాలంగా పని చేస్తున్న భిక్షంగౌడ్ ఉండటంతో జిల్లా ఉపాధ్యాయుల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. 2019లో జరిగిన నల్లగొండ – ఖమ్మం – వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్ ఓడిపోయారు. అప్పుడు కూడా పీఆర్‌టీయూలోని ఒక వర్గం యూనియన్ బలపరచిన అభ్యర్థికి పని చేయలేదనే ప్రచారం జరిగింది. అందువల్లే పీఆర్‌టీయూ అభ్యర్థి ఓడిపోయారని అప్పట్లో రాష్ట్ర యూనియన్‌లోనూ చర్చ జరిగింది. అయినా అప్పట్లో ఇలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు మాత్రం పక్కా చర్యలు చేపట్టింది.

తాత్కాలిక అధ్యక్షుడిగా డీవీఎస్ ఫణికుమార్

పీఆర్‌టీయూ జిల్లా తాత్కాలిక అధ్యక్షుడిగా డీవీఎస్ ఫణికుమార్‌ను నియమించారు. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న సుంకరి భిక్షంగౌడ్‌ను జిల్లా అధ్యక్ష పదవి నుంచి, ప్రాథమిక సభ్యత్వం నుంచి రాష్ట్ర యూనియన్ తొలగించినట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు యూనియర్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగళి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు.

ఎమ్మెల్సీగా పోటీకి వస్తాననే..



భవిష్యత్‌లో ఎమ్మెల్సీగా పోటీకి వస్తానన్న భయం మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్‌లో ఉంది. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష పదవికి పోటీకి వస్తాననే భయం శ్రీపాల్‌రెడ్డిలో ఉంది. అందుకే నన్ను సస్పెండ్ చేశారు. ఆయన చేసిన సస్పెన్షన్ చెల్లదు. నేను జనరల్ బాడీ ద్వారా ఎన్నికయ్యాను. జనరల్ బాడీ ద్వారానే నాపై చర్య తీసుకోవాలి. రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీపాల్‌రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడ్డారు. నేనే ఆయన్ను బహిష్కరిస్తున్నా.

– సుంకరి భిక్షంగౌడ్

పంట నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పక్కన వివిధ శాఖ అధికారులు

నల్లగొండ : ఇటీవల అకాల వర్షాలు, వడగళ్ల వాన, ఈదురు గాలులతో జరిగిన పంట నష్టంపై ప్రాథమిక నివేదికననుసరించి రైతు వారీగా నష్టం వివరాలు అంచనా వేసి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ, రెవెన్యూ అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నష్టం వివరాలపై ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఉత్పత్తిలో 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం సంభవించిన వివరాలు క్షేత్రస్థాయిలో రైతు వారీగా సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. సర్వేలో గుర్తించిన అంశాలను నిర్దిష్ట ప్రొఫార్మాలో బ్యాంక్ అకౌంట్ వివరాలతో సహా పొందుపరచాలన్నారు. సమావేశంలో డీఏఓ సుచరిత, ఉద్యాన అధికారి సంగీత లక్ష్మి, ఏడీ హుస్సేన్ బాబు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలు

మిర్యాలగూడ : పోడు భూములు సాగుచేసుకుంటున్న అర్హులందరికీ పట్టాలు అందించనున్నట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పోడు భూముల పట్టాల పంపిణీ కోసం రూపొందించిన అర్హుల జాబితాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిర్యాలగూడ డివిజన్ వ్యాప్తంగా 12,337 దరఖాస్తులు రాగా ఫారెస్ట్ రిజర్వేషన్ కమిటీ 8 వేల దరఖాస్తులను తిరస్కరించిందన్నారు. అదేవిధంగా 845 దరఖాస్తులు డివిజన్ స్థాయిలో తిరస్కరణకు గురయ్యాయన్నారు. మిగిలిన 1,213 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులపై తిరిగి విచారణ చేపట్టి అర్హులు ఉంటే పట్టాలు అందజేస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి, డీఏఓ రాధా, ఎఫ్‌ఆర్‌ఓ ఆనందరెడ్డి, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి పీహెచ్‌సీలో తనిఖీలు

వేములపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మహిళా ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ప్రతి మంగళవారం మహిళలకు ఆరోగ్య పరీక్షలు, జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేస్తున్న వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య మహిళా కేంద్రాలకు వచ్చే వారికి ఎనిమిది రకాల ఆరోగ్య సమస్యలపై చికిత్స అందించాలన్నారు. ఆస్పత్రిలో సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేస రవి, వైద్యాధికారి సుచరిత, సీహెచ్‌ఓ స్వామి, పీహెచ్‌ఎన్ పద్మ, సూపర్‌వైజర్ శాంతమ్మ, శౌరీలు, శోభ, నరేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ సమీక్ష



మిల్లర్లు, అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ : 2022–23 యాసంగి ధాన్యం కొనుగోళ్లపై శుక్రవారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మిల్లర్లు, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేసుకునే విధంగా ఖాళీగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే ధాన్యం కొనుగోలు చేసేవిధంగా హమాలీల కొరత, ఇతర ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందుస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఎం నాగేశ్వర్‌రావు, ఇతర శాఖల అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి కిరణ్‌యాదవ్ రాజీనామా



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌యాదవ్

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కిరణ్‌యాదవ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం నల్లగొండలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్ కుమార్‌రెడ్డి పీసీసీ అధ్యక్షులుగా ఉన్న కాలంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశానని తెలిపారు. అయితే రేవంత్‌రెడ్డి అధ్యక్షుడు అయ్యాక 15 మందితో అధికార ప్రతినిధులను, 84 మందితో ప్రధాన కార్యదర్శులతో కమిటీ ప్రకటించినా అందులో తమకు చోటు దక్కలేదన్నారు. ఆత్మగౌరవం లేనిచోట తాను పని చేయలేనని అందుకే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆమేరకు రాష్ట్ర అధ్యక్షుడికి లేఖ పంపుతున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో పెరిక వెంకటేశ్వర్లు, చింతపల్లి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై పన్నులు.. కార్పొరేట్లకు రాయితీలు



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : ప్రజలపై పన్నులు వేస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి భవిష్యత్ ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో మజ్దూర్ కిసాన్ సంఘర్షణ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ర్యాలీకి దేశ వ్యాప్తంగా 10 లక్షల మంది రైతులు, రైతు కూలీలు, కార్మికులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యుడు బావండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, పిల్లుట్ల సైదులు, వెంకటరెడ్డి, నల్లగుంట్ల సోమయ్య, బాబునాయక్, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో మినీ బ్యాంకు

- ప్రజలకు సేవలు చేరువ చేసిన పోస్టల్ శాఖ
- బ్యాంకు నిర్వహణకు ముందుకొచ్చిన 128 మంది డీలర్లు
- నేటి నుంచి సేవలు ప్రారంభం



నల్లగొండ : రేషన్ షాపుల్లో నేటి నుంచి బ్యాంకు సేవలు అందనున్నాయి. ఇప్పటివరకు పోస్టల్‌శాఖ పోస్టాఫీసుల్లోనే లావాదేవీలు నిర్వహించేది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు రేషన్‌షాపుల ద్వారా బ్యాంకు సేవలు అందించాలని నిర్ణయించింది. అందుకోసం ఆసక్తి ఉన్న రేషన్ డీలర్ల నుంచి గతంలోనే దరఖాస్తులు కోరగా నల్లగొండ జిల్లాలో 128 మంది తమ షాపుల ద్వారా బ్యాంకు లావాదేవీలను నిర్వహించేందుకు ముందుకొచ్చారు. దీంతో పోస్టల్ శాఖ ఆ డీలర్లను సర్వీస్ ప్రొవైడర్లుగా నియమించింది. బ్యాంకులు లేని గ్రామీణ ప్రాంతాల్లో ఈ సేవలు ఎంతో ఉపయోగపడనున్నాయి.

సేవలు, కమీషన్ ఇలా..

అన్ని బ్యాంకు ఖాతాల నుంచి నుంచి డబ్బులు డ్రా చేయడం, బ్యాంకులో డబ్బులు జమ చేయడం. రైతు బంధు, స్కాలర్‌షిప్, కేసీఆర్ కిట్, పీఎం కిసాన్, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే డబ్బులను విత్‌డ్రా చేసుకోవడం, ఖాతా తెరవడం, వాహనాల ఇన్సూరెన్స్, విద్యుత్ బిల్లు, నల్లా బిల్లు, సెల్‌ఫోన్ బిల్లు, తదితర డిజిటల్ లావాదేవీలు చేసుకునేందుకు అవకాశం ఉంది. ప్రతి లావాదేవీపై డీలర్‌కు రూ.4 చొప్పున కమీషన్ చెల్లిస్తారు. రూ.5 లక్షల లావాదేవీల దాటితే రూ.11 చొప్పున చెల్లిస్తారు.

బ్యాంకు సేవలపై అవగాహన

జిల్లా వ్యాప్తంగా 128 రేషన్ షాపు డీలర్లు బ్యాంకు సేవలను అందించేందుకు పోస్టల్ శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నారు. డీలర్లు వారి మొబైల్ ఫోన్‌లోనే ఐపీపీబీఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సేవలు అందించనున్నారు. ఆ సెల్‌ఫోనుకు అనుసంధానించేలా.. పోస్టల్ శాఖ వేళిముద్ర వేసే (ఏఈపీఎస్) ఆధార్ ఎనబుల్ పేమెంట్ సిస్టమ్ మిషన్‌ను ఇచ్చింది. దాన్ని ఏవిధంగా ఉపయోగించాలన్నదానిపై డీలర్లకు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, పోస్టల్‌శాఖ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మీకాంత్, రవీంద్రనాయక్, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాను అడ్డుకుంటాం

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రంతో పాటు మునుగోడు నియోజకవర్గంలోకి ఫార్మా కంపెనీలను రానీయమని.. వచ్చినా అడ్డుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం స్పష్టం చేశారు. గట్టుప్పల సర్పంచు ఇడెం రోజా నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫార్మా కంపెనీలను అడ్డుకునేందుకు అవసరమైతే అన్ని పార్టీలను కలుపుకొని కార్యాచరణ ప్రకటించి ఉద్యమిస్తామని తెలిపారు. తక్షణమే ఫార్మా కంపెనీ యజమానులు తమ పనులను నిలిపివేయాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఇడెం కైలాసం, సీపీఐ నాయకులు సతీష్, రాపోలు సత్తయ్య రమేశ్, మాదగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

కేసుల విచారణలో నిర్లక్ష్యం చేయొద్దు



మునుగోడు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ అపూర్వరావు

- ఎస్పీ అపూర్వరావు

మునుగోడు, చండూరు : కేసుల విచారణలో పోలీస్ సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని ఎస్పీ అపూర్వరావు సూచించారు. శుక్రవారం ఆమె మునుగోడు, చండూరు పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో రికార్డులను పరిశీలించి విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసు నమోదు చేసిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు సాక్షులను విచారించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో క్రైం రేటు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, పీడీఎస్ రైస్ రవాణా, జూదంపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణకు రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, ఓవర్ స్పీడ్, పరిమితికి మించి ప్రయాణించే వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట నల్లగొండ డీఎస్పీ నర్సింహారెడ్డి, చండూరు సీఐ అశోక్‌రెడ్డి, ఎస్‌ఐలు డి.సతీష్‌రెడ్డి, నవీన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ క్రైం : సైబర్ నేరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అపూర్వరావు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల వినియోగంపై మూడు నెలల పాటు నిర్వహించిన కార్యక్రమం శుక్రవారం పూర్తయినట్లు తెలిపారు. ఉమెన్ సెఫ్టీ వింగ్, విద్యాశాఖ ఆధ్వర్యంలో సైబర్ అంబాసిడర్ ప్లాట్‌ఫాం వేదికగా జిల్లాలో 88 పాఠశాలల నుంచి 352 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులను మెంటర్స్‌గా ఎంపిక చేసి ఆన్‌లైన్‌లో క్లాసులు నిర్వహించినట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో సమావేశం

రామగిరి(నల్లగొండ) : డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా కార్యక్రమాల నిర్వహణపై శనివారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల సంఘాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉండాలి

కట్టంగూర్ : జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని డీఈఓ బొల్లారం భిక్షపతి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇన్విజిలేటర్ల శిక్షణ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పామనగుండ్లలో 10వ తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ నల్లగొండ వారి సహకారంతో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఎస్‌లు చల్మరాజు, ఉషారాణి, డీఓలు రామ్మూర్తి, మల్లయ్య, హెచ్‌ఎంలు జ్యోతి, రాధిక, సీఆర్‌పీలు పాలగోని రవికుమార్‌గౌడ్, సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలమూరి రామకృష్ణ, సర్పంచ్ వడ్డె సైదిరెడ్డి ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

బాలల హితం.. శ్రీనివాసనగర్



శ్రీనివాసనగర్‌లోని అంగన్‌వాడీ ప్లే స్కూల్‌లో ఆడుకుంటున్న చిన్నారులు



గ్రామంలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

- రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక
- బాలల స్నేహపూర్వక విభాగంలో అవార్డు

మిర్యాలగూడ : మండలంలోని శ్రీనివాసనగర్ గ్రామ పంచాయతీ అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోంది. ఇప్పటికే మండల స్థాయిలో 9 అంశాల్లో, జిల్లా స్థాయిలో 6 అంశాల్లో అవార్డు గెలుచుకున్న శ్రీనివాసనగర్.. తాజాగా బాలల స్నేహపూర్వక విభాగంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీకి శ్రీనివాసనగర్ నామినేట్ అయ్యింది. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ అండ్ వెటర్నరీ యూనివర్సిటీ ఆడిటోరియంలో రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచ్ బోగవెల్లి వెంకటరమణచౌదరి అవార్డును అందుకున్నారు.

గ్రామంలో పిల్లల కోసం ప్రత్యేక సౌకర్యాలు..

శ్రీనివాసనగర్ గ్రామంలో అటు పరిపాలన విభాగం.. ఇటు పిల్లల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలో 0–5 వయస్సులోపు 76 మంది పిల్లలు, 6–18 ఏండ్ల వయస్సులోపు 138 మంది ఉన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల, మోడల్ పాఠశాలల్లో మొత్తం 732 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గ్రామంలో ఏడాదిలో నాలుగుసార్లు ప్రత్యేకంగా బాల సభ పేరుతో పంచాయతీలో సమావేశం ఏర్పాటు చేసి పిల్లలకు కావాల్సిన వసతులపై చర్చిస్తున్నారు. అందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆధునీకీకరించి ప్లే స్కూల్‌గా తీర్చిదిద్దారు. చిరు ధాన్యాలతో బిస్కెట్లను తయారు చేసి అందిస్తున్నారు. పల్లె ప్రకృతి వనంలో 1.5 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో 30 రకాల పండ్ల చెట్లు, కూరగాయల సాగు చేపట్టి విద్యార్థులకు ఆహారంగా అందిస్తున్నారు. పిల్లలకు క్లాసికల్ డ్యాన్స్, కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. గ్రామంలో లైబ్రరీ ఏర్పాటు చేసి మూడు వేల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అదేవిధంగా గ్రామంలోని పిల్లల కోసం ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్లే స్కూల్‌గా మార్చాం



గ్రామంలోని పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల, అభివృద్ధి కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. అంగన్‌వాడీ సెంటర్‌ను ప్లే స్కూల్‌గా మార్చాం. పిల్లలకు క్లాసికల్ డ్యాన్స్, రక్షణ కోసం కరాటేలో శిక్షణ ఇస్తున్నాం.

– భోగవెల్లి వెంకటరమణచౌదరి, సర్పంచ్, శ్రీనివాసనగర్

సర్పంచ్ చొరవతోనే అవార్డు



శ్రీనివాసనగర్ గ్రామం బాలల స్నేహపూర్వక విభాగంలో రాష్ట్ర ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక కావడంలో సర్పంచ్ పాత్ర కీలకం. అనతికాలంలో శ్రీనివాస నగర్ రాష్ట్రస్థాయిలో గుర్తింపు సాధించింది. అధికారులు సమన్వయం, సర్పంచ్ కృషి వల్లే ఈ అవార్డు దక్కింది. జాతీయ స్థాయిలో అవార్డు సాధించేందుకు కృషి చేస్తాం.

– గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీడీఓ, మిర్యాలగూడ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి



చెవుల రోషమ్మ మృతదేహం

మునగాల(కోదాడ): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికి త్స పొందుతున్న మహిళ మృతిచెందింది. ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నడిగూడెం మండలం రామాపురం గ్రామానికి చెందిన 14మంది కూలీలు గత నెల 25న ఆకుపాముల వద్ద జీఎమ్మార్ సంస్థ ఆధ్వర్యంలో రహదారిపై పనులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో కూలీల ట్రాక్టర్‌ను వెనుక నుంచి లారీ ఢీకొట్టిన ప్రమాదంలో అక్కడికక్కడే నేలమర్రి వినోద, అదే రోజు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుమ్మల ధనమ్మ మృతిచెందారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చెవుల రోషమ్మ(55)ను కుటుంబసభ్యులు తొలుత ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఐదు రోజులుగా మృత్యువుతో పోరాడిన రోషమ్మ శుక్రవారం తుదిశ్వాస విడిచింది. దీంతో ప్రమాద మృతుల సంఖ్య మూడుకు పెరిగింది. మృతురాలు రోషమ్మకు కుమార్తె, కుమారుడు, భర్త ఉన్నారు.

ఉప సర్పంచ్‌ను తొలగించాలని ఫిర్యాదు

తుర్కపల్లి: మండలంలోని ముల్కలపల్లి ఉప సర్పంచ్ ఉదయ్‌కుమార్‌ను తొలగించాలని వార్డు సభ్యులు, గ్రామస్తులు ఎంపీడీఓ ఉమాదేవికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతికి పాలుపడుతున్నందుకు తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో వార్డు సభ్యులు, శంకర్, వీరేశ్, వాలీ, అరుణ, అలివేల, లక్ష్మీ తదితరులున్నారు.

అత్తింటి వేధింపులతోనే ఆత్మహత్య

- మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ

నేరేడుచర్ల : అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధించడంతో తమ కుతూరు గేయశ్రీ(28) ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు డొకుపర్తి ఈశ్వరనాగ ప్రసాద్ గుప్తా ఆరోపించారు. నేరేడుచర్లలో గురువారం ఆత్మహత్యకు పాల్పడిన గేయశ్రీ ఇంటికి శుక్రవారం కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి వెళ్లి విచారణ చేపట్టారు. అదనపు కట్నం కోసం ఆమె భర్త ఆత్కూరి సుబ్బారావు, అత్త పద్మ శారీరకంగా, మానసికంగా, సూటిపోటి మాటలతో వేధించారని డీఎస్పీకి తెలిపారు. మృతురాలి తండ్రి ఈశ్వరనాగ ప్రసాద్ గుప్తా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేసుకోగా డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులు ఐకమత్యంతో పోరాడాలి

- టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం



రైతులతో మాట్లాడుతున్న కోదండరాం

హుజూర్‌నగర్ (చింతలపాలెం): రైతులు తమ భూములను కాపాడుకునేందుకు ఐకమత్యంతో పోరాడాలని టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం సూచించారు. చింతలపాలెం మండలంలోని పాత వెల్లటూరు వద్ద నూతనంగా ఏర్పాటు చేయనున్న లిఫ్ట్ నిర్మాణ, పైపుల తయారీ ప్రాంతం, రైతుల భూములతో పాటు పాతలిఫ్ట్‌ను ఆయన పరిశీలించారు. కొత్త లిఫ్ట్ వల్ల తమకు లాభం కన్నా నష్టమే ఎక్కువ అని, పాతలిఫ్ట్‌కే మరమ్మతులు చేయించి నడిపించాలని ఈ సందర్భంగా రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరాం మాట్లాడారు. అన్యాయంగా భూములు పోతున్నప్పుడు రైతులు ఊరుకోవద్దన్నారు. ఐకమత్యంతో ప్రభుత్వంపై పోరాడాలని, అందుకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం చేసే ఈపని కరెక్టు కాదని, పాత లిఫ్ట్ కట్టి పదేళ్లు కూడా కాలేదని ఆయన చెప్పారు. ఉన్న దానిని నడపకుండా కాంట్రాక్టర్ల జేబులు నింపే ప్రాజెక్టు తమకు వద్దని ఆయన చెప్పారు. రైతులందరూ లిఫ్ట్‌కు వ్యతిరేకంగా పోరాడాలని అన్నారు. భూనిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడపల్లి ఆశప్ప మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా లిఫ్ట్ నిర్మాణం జరపడం దుర్మార్గమన్నారు. న్యాయస్థానాన్ని ఆశ్రయించిరైతులకు న్యాయం జరిగేలా పోరాడుతామని చెప్పారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు ఎ నాగయ్య, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎం మల్లయ్య, భిక్షం, నిర్వాసిత రైతులు యర్రం లక్ష్మారెడ్డి, కె శ్రీనివాసరెడ్డి, వర్రా వెంకటరెడ్డి, మౌలాలి, శంభిరెడ్డి, సుదరమౌళీశ్వర రెడ్డి, మాధవరెడ్డి, ముడెం వీరారెడ్డి పాల్గొన్నారు.

వర్షంలోనే కొనసాగిన సభ

నూతన లిఫ్ట్ ప్రాంతంలో ప్రొఫెసర్ కోదండరాం రైతులతో సమావేశం ప్రారంభించగానే వర్షం ప్రారంభమైంది. సమావేశం ఆద్యాంతం వర్షంలోనే కొనసాగింది. అయినా రైతులు ఎటూ వెళ్లకుండా వర్షంలోనే తడుస్తూ ప్రసంగం విన్నారు. అవసరమైతే మళ్లీ వస్తానని కోదండరాం చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

రెండు కార్లు ఢీ.. నలుగురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

నల్లగొండ క్రైం : రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై నీలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మర్రిగూడ బైపాస్ వద్ద చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గుంటూరు ప్రాంతానికి చెందిన అమర్‌రెడ్డి, వదన స్వాతి శుక్రవారం తెల్లవారుజామున కారులో హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. మార్గమధ్యలో మర్రిగూడ బైపాస్ వద్ద వీరి కారు అదుపుతప్పి తొలుత ఎడమ వైపు డివైడర్‌ను ఢీకొట్టింది. నిద్రమత్తులోంచి తేరుకున్న అమర్‌రెడ్డి కారును అదే వేగంతో కుడివైపునకు తిప్పడంతో డివైడర్‌ను ఎక్కి ఎదురుగా మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అమర్‌రెడ్డి, స్వాతితో పాటు మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందిలో డ్రైవర్ సింగం కృష్ణ, బ్రహ్మయ్యలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన బ్రహ్మయ్యను హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. అమర్‌రెడ్డి నిద్రమత్తే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నలగొండ రూరల్ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కనగల్: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. కనగల్ మండలం జి.యడవెల్లిలో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తలారి వెంకన్నకు ఇదే గ్రామ పంచాయతీ ఆవాసం మదనాపురానికి చెందిన సుజాతతో 20 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె సంతా నం . కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

కుటుంబంలో తగాదాలు

వెంకన్న, సుజాత దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలోనే కొద్ది రోజులుగా కుటుంబంలో తగాదాలు జరుగుతున్నాయి. వెంకన్న గురువారం అర్ధరాతి దాటిన తర్వాత నిద్రలోంచి లేచి చూడగా భార్య కనిపించలేదు. ఇళ్లంతా వెతికినా కనిపించలేదు. అనంతరం స్నానాల గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే సుజాత అందులోని దూలానికి ఉరివేసుకుని విగతజీవిగా కనిపించింది. విషయం చుట్టుపక్కల వారికి తెలపడంతో సుజాత మృతదేహాన్ని కిందకు దించారు. సమాచారం మేరకు ఎస్‌ఐ నాగేష్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని..

తన సోదరి సుజాతను భర్త వెంకన్న హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని మృతురాలి సోదరుడు సాయిలు ఆరోపించారు. ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే

- బీజేపీ భువనగిరి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు



మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రావు తదితరులు

ఆలేరురూరల్ : ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత ప్రజా సమస్యలను గాలికి వదిలేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంలో బిజీగా ఉన్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు ఆరోపించారు. శుక్రవారం ఆలేరు రైల్వే గేటు వద్ద అండర్ పాస్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం వాటా నిధులతో ఒకవైపు పనులు పూర్తికాగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన మరో వైపు పనులు మూడేళ్లుగా నిలిచిపోయాయని తెలిపారు. ఈ మధ్య కాలంలో రైల్వేగేటు వద్ద ఓ వృద్ధురాలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో చనిపోయిందని గుర్తుచేశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్న ఎమ్మెల్యేని తొందర్లోనే కనువిప్పు కలగాలన్నారు. బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్యాలయాలు పాఠశాలలు, బ్యాంకులు రైల్వేగేటు ఇవతల ఉండడంతో వృద్ధులు, పిల్లలు, మహిళలు పట్టాలు దాటుతూ ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. అండర్‌పాస్ పూర్తయ్యే వరకు పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్, బడుగు జాహంగీర్, దూసరి రాఘవేంద్ర, చిరిగే శ్రీనివాస్, కౌన్సిలర్ సంగు భూపతి, బందెల సుభాష్, రాజశేఖర్‌రెడ్డి, తునికి దశరథ, ఐడియా శ్రీను, వీరేషం, రాజు, సిద్దులు, శ్రీనివాస్, రమేష్, గంగేష్, కిషన్, శంకర్, హనుమంతు, సందీప్, భాస్కర్, సతీష్, సంపత్, వెంకటేష్, రవీందర్ పాల్గొన్నారు.

యాదాద్రిలో వ్యవసాయ శాఖ కార్యదర్శి పూజలు



రఘునందన్ రావుకు లడ్డు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు కుటుంబ సమేతంగా శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. ఆ తర్వాత ప్రధానాలయంలోని స్వయంభూవులను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలోని అద్దాల మండపం వద్ద వేదాశీర్వచనం జరిపించారు.

పోలీస్ కస్టడీకి 'కృష్ణవేణి' కరస్పాండెంట్

భువనగిరి : విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో రిమాండ్‌లో ఉన్న పట్టణంలోని కృష్ణవేణి టాలెట్ హైస్కూల్ కరస్పాండెంట్ రఘు వెంకట సురేష్‌కుమార్‌ను విచారణ నిమిత్తం శుక్రవారం పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మార్చి 20న పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించారని వారు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నల్లగొండ జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ నిమిత్తం అతడిని కస్టడీలోకి తీసుకున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రఘుపతి

- ప్రత్యర్థిపై ఒక్క ఓటుతో విజయం



విజయ సంకేతం చూపుతున్న కమిటీ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నేతి రఘుపతి విజయం సాధించారు. శుక్రవారం జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి కిరణ్‌కుమార్, ఎండీ.నజీరుద్దీన్, నేతి రఘుపతి, ఎస్.రవీంద్రనాథ్ ఠాగూర్ పోటీ చేశారు. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో సమీప అభ్యర్థి కిరణ్‌కుమార్‌పై ఒక్క ఓటు తేడాతో నేతి రఘుపతి విజయం సాధించారు. నేతి రఘుపతి 109, కిరణ్‌కుమార్ 108, రవీంద్రనాథ్ ఠాగూర్ 44, రజీయుద్దీన్‌కు 6 ఓట్లు వచ్చాయి. అయితే నేతి రఘుపతి 2010లో మొదటిసారి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గెలుపొందారు.

నూతన కమిటీ వివరాలు...

అధ్యక్షుడిగా రఘుపతి, ఉపాధ్యక్షులుగా అయితగోని లాలయ్య, మోర ప్రవీణ్‌కుమార్, జనరల్ సెక్రటరీగా జె.రవికుమార్, కోశాధికారిగా దాసరి యాదగిరి గెలుపొందారు.

ఎన్నికలను రీ షెడ్యూల్ చేయాలి

నల్లగొండ బార్ అసోసియేషన్ ఎన్నికలు రీ షెడ్యూల్ చేయాలని న్యాయవాది తడకమళ్ల కిరణకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సహచర న్యాయవాదులతో కలిసి జిల్లా జడ్జి బీఎస్.జగ్జీవన్‌కుమార్, అదనపు కలెక్టర్ ఏ. భాస్కర్‌రావుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగొండ బార్ అసోసియేషన్‌లో మొత్తం ఓట్లు 272 ఉండగా శుక్రవారం జరిగిన ఎన్నికల్లో 269 ఓట్లు పోల్ కాగా.. నలుగురు గైర్హాజరైనట్లు లెక్కలు చెప్పారని.. గైర్హాజరైన ఓట్లతో కలిపి 273 అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి దృష్టికి తీసుకెళ్లగా.. పట్టించుకోలేదన్నారు. ఎన్నికల అధికారులపై చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిలో న్యాయవాదులు రాఘవరావు, శ్రీనివాస్, అశోక్‌కుమార్, కిషోర్‌కుమార్ ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

నల్లగొండ క్రైం : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. నల్లగొండ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లుకు చెందిన ఆలకుంట్ల సుధాకర్ (38) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఉపాధి లభించక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన సుధాకర్ గత నెల 29న ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఉపేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ టూటౌన్ పోలీసులు తెలిపారు.

కుమార్తెపై బెంగతో తల్లి బలవన్మరణం

నల్లగొండ పట్టణంలోని లకుమారపు శ్రీనివాస్, ఝాన్సీ దంపతులకు కుమారుడు, కుమార్తె శ్రీజ సంతానం. శ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఉన్నత విద్య అభ్యసించిన కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, కుమార్తె శ్రీజకి ఎనిమిది మాసాల క్రితం అమెరికాలో స్థిరపడిన వ్యక్తితో వివాహం చేశారు. అయితే, కుమార్తె ప్రస్తుతం గర్భవతి. అమెరికాలో కుమార్తె ఎలా ఉందోనన్న బెంగతో తల్లి ఝాన్సీ తీవ్ర మనస్తాపం చెందింది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం ఉదయం భర్త లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇరుగుపొరుగు వారు గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్డీఓ, చెరుపల్లి, పల్లా

యాదగిరిగుట్ట రూరల్: మహిళలు స్వశక్తితో ఎదిగి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆర్డీఓ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి. అన్నారు. పెద్దకందుకూరులో ఆరుట్ల కమలాదేవి రామచంద్రారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరి, కంప్యూటర్ శిక్షణ ఇచ్చి శుక్రవారం సరిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీరశ్రీశైలం, ఆరుట్ల ఫౌండేషన్ చైర్మన్ సుశీలా దేవి, సర్పంచ్ రాములు తదితరులు పాల్గొన్నారు.

మందు పిచికారీలో రక్షణ చర్యలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

భూదాన్‌పోచంపల్లి : రైతులు పంట పొలాలకు మందు పిచికారీ చేసేటప్పుడు తగు రక్షణ చర్యలు పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సశ్యరక్షణ మందుల అవశేషాల విభాగం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామంలోని ఎస్సీ కులాల రైతులకు జిల్లా ఏరువాక, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని శస్యరక్షణ మందుల అవశేషాల విభాగం సౌజన్యంతో సశ్యరక్షణ మందులు సురక్షిత పద్ధతులు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిచికారీ సమయంలో రైతులు తప్పనిసరిగా రక్షణ దుస్తులు, చేతికి గ్లౌజులు, ముక్కుకు మాస్కు, కళ్లకు రక్షణ కవచాలు, కాళ్లకు గమ్‌బూట్లు, తలకు తొడుగు ధరించాలని సూచించారు. అదేవిధంగా ఎండ తీవ్రత ఉన్నా, లేదా గాలి వేగం ఎక్కువగా ఉన్నపుడు, మంచు లేదా వర్షం కురిసే సమయాల్లో మందు పిచికారీ చేయరాదని చెప్పారు. పిచికారీ చేసే సమయంలో నీరు తాగడం, ఆహారం తినడం, పొగతాడం చేయరాదని కోరారు. అలాగే పిల్లలచే పిచికారీ చేయించవద్దని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త జెమీనా, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త అనిల్‌కుమార్, శాస్త్రవేత్త మధుశేఖర్, మండల వ్యవసాయశాఖ అధికారి ఏజాజ్ అలీఖాన్, సర్పంచ్ చిన్నలచ్చి లింగస్వామి, ఉపసర్పంచ్ ఆర్ల లింగస్వామి, ఏఈఓలు నరేశ్, శ్వేత, శిరీష, పవిత్రన్, సామ రాంరెడ్డి పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడు దుర్మరణం



మైసయ్య మృతదేహం

చింతపల్లి : హైదరాబాద్–నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండల పరిధిలోని కుర్మేడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని కుర్మేడుకు చెందిన అనంతుల మైసయ్య(60) శుక్రవారం గ్రామ స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి కుమారుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిడుగు శబ్దానికి రైతుకు గుండెపోటు

- ఆస్పత్రికి తరలించేలోపే మృతి



రామయ్య (ఫైల్)

మేళ్లచెరువు : పిడుగు శబ్దానికి రైతుకు గుండెపోటు వచ్చి కుప్పకూలిపోయాడు. సమీప రైతులు అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. మేళ్లచెర్వు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రేవూరు గ్రామానికి చెందిన రైతు సాధం రామయ్య (45) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం సమయంలో గాలివాన రావడంతో ఆరబెట్టిన మిర్చి పంటపై పట్టాలు కప్పేందుకు వ్యవసాయ భూమి వద్దకు వెళ్లాడు. సమీప రైతులను సాయం చేయాలని కోరాడు. వారు వచ్చే లోపే కొద్ది దూరంలో పిడుగు పడిన శబ్దానికి రామయ్య అక్కడే కుప్పకూలిపోయాడు. రైతులు అతడిని రామాపురం రెయిన్ సిమెంట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కొండమల్లేపల్లి : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుడ్డోనితండాకు చెందిన మూఢావత్ కవిత తీవ్రమైన కడుపు నొప్పిని భరించలేక మార్చి 27న క్రిమిసంహారక మందు తాగింది. గమనించిన భర్త కస్వర్‌లాల్ ఆమెను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నీమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాగా, అక్కడ కవిత చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భూ వివాదాలతో వ్యక్తిపై హత్యాయత్నం

గరిడేపల్లి : భూ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తిపై ముగ్గురు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన గరిడేపల్లి మండలం పొనుగోడులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జూలకంటి మైసయ్యకు అతడి సోదరుడి కుమారుడు నరేష్‌కు భూ వివాదాలు ఉన్నాయి. వాటిని మనసులో పెట్టుకుని నరేష్ తన స్నేహితులైన కొమరాజు దుర్గయ్య, నందిపాటి మధులు కలిసి బైక్‌పై గరిడేపల్లికి వెళ్తున్న మైసయ్యను దారికాసి కర్రలు, రాళ్లు, కొడవళ్లతో దాడి చేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడిన మైసయ్యను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. భర్తపై హత్యయత్నానికి పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మైసయ్య భార్య నాగమణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ పంచాయతీలకు పురస్కారం

ఉమ్మడి జిల్లాలోని నాలుగు గ్రామ పంచాయతీయలను రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాలలో ఉత్తమ పంచాయతీలుగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలను అందజేసింది. సోలార్ విద్యుత్ వినియోగంలో చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామం రాష్ట్ర స్థాయిలో నాల్గవ స్థానం పొందింది. బాలల హిత పంచాయతీ విభాగంలో మిర్యాలగూడ మండలం శ్రీనివాసనగర్ మూడోస్థానం, 'స్వయం సమృద్ధి' విభాగంలో రామన్నపేట మండలం వెల్లంకి గ్రామం రెండోస్థానం పొందాయి. అదేవిధంగా 'మహిళా హితం' విభాగంలో ఆత్మకూర్.ఎస్ మండలంలోని ఏపూర్ గ్రామం రెండో స్థానంలో నిలిచింది.

–సాక్షి నెట్‌వర్క్



సోలార్ వినియోగం కేటగిరీలో మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న పంతంగి సర్పంచ్ బాతరాజు సత్యం, చిత్రంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి తదితరులు



మహిళా హితం కేటగిరీలో మంత్రి కేటీఆర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఏపూరు సర్పంచ్ సానబోయిన రజిత, పంచాయతీ కార్యదర్శి ఉమ, చిత్రంలో మంత్రి దయాకర్‌రావు, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, డీపీఓ, డీఆర్‌డీఓ తదితరులు



బాలల హితం కేటగిరీలో పురస్కారాన్ని మంత్రి కేటీఆర్ చేతులమీదుగా అందుకుంటున్న శ్రీనివాసనగర్ సర్పంచ్ వెంకటరమణచౌదరి, గ్రామ కార్యదర్శి అనిత



స్వయం సమృద్ధి విభాగంలో మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వెల్లంకి సర్పంచ్ మహేందర్‌రెడ్డి, చిత్రంలో భువనగిరి జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ